సాక్షి
చిత్తూరు
శనివారం । 28 । డిసెంబర్ । 2024



నో డ్రగ్స్ అని చెప్పండి
యువతకు నో డ్రగ్స్ అని చెప్పాలని, వారు మత్తు బారిన పడకుండా చర్యలు చేపట్టా లని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. - 8లో



బోయకొండ భద్రతకు చర్యలు
బోయకొండ గంగమ్మ ఆలయ భద్రతకు చర్యలు తీసుకున్నట్లు ఆలయ ఈఓ ఏకాంబరం తెలిపారు. - 8లో



రివిజన్‌పై దృష్టి పెట్టండి
పది సిలబస్ త్వరగా పూర్తి చేసి, రివిజన్‌పై ప్రత్యేకదృష్టి సారించాలని డీఈఓ వరలక్ష్మి ఉపాధ్యాయులను ఆదేశించారు. - 8లో

న్యూస్‌రీల్

వరసిద్ధుడికి రూ.1.97 కోట్ల ఆదాయం



హుండీ కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

కాణిపాకం: వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను శుక్రవారం లెక్కించారు. ఉదయం లెక్కింపు ప్రారంభం కాగా మధ్యాహ్నం వరకు సాగింది. కాగా హుండీల ద్వారా రూ.1,97,76,188 ఆదాయం వచ్చినట్లు ఈఓ పెంచలకిషోర్ తెలిపారు. గోసంరక్షణ హుండీ ద్వారా రూ.17,242, నిత్యాన్నదానం హుండీ ద్వారా రూ.35,700 వచ్చిందన్నారు. యూఎస్ ఏపీ 1,344 డాలర్లు, యూఏఈ 10 దిర్హామ్స్, ఇంగ్లాడ్‌వి 35 పౌండ్స్, యూరోవి 155 యూరోలు, కెనడావి 10 డాలర్లు, సింగపూర్‌వి 80 డాలర్లు, ఆస్ట్రేలియావి 290 డాలర్లు వచ్చాయన్నారు. బంగారం 75 గ్రాములు, వెండి 4.10 కిలోలుగా లెక్క తేలిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు కృష్ణారెడ్డి, హరిమాధవరెడ్డి, ధనంజయ, నాగేశ్వరరావు, కోదండపాణి, శ్రీధర్‌బాబు, బాలరంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

31వరకు ఎస్సీ కులగణన సోషల్ ఆడిట్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఈ నెల 31వ తేదీ వరకు ఎస్సీ కులగణనపై సోషల్ ఆడిట్ నిర్వహించి, అభ్యంతరాలు స్వీకరించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ కులగణన వివరాలను గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శించారన్నారు. ఆ వివరాల్లో ఏవైనా అభ్యంతరాలున్నట్లు అయితే ఈ నెల 31వ తేదీ లోపు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామన్నారు. కులగణన తుది వివరాలు 2025 జనవరి 10వ తేదీన సచివాలయాల్లో ప్రదర్శిస్తామని చెప్పారు. కులగణనపై మూడు దశల్లో తనిఖీలుంటాయన్నారు. పేరు, ఆధార్ నంబర్, పుట్టిన తేదీ, వయస్సు, ఉపకులం వివరాలను సచివాలయాల్లో ప్రదర్శిస్తారన్నారు. ప్రజల నుంచి వచ్చే అభ్యంతరాలను వీఆర్వోలు పరిశీలించి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌కు పంపుతారని చెప్పారు. ఆర్‌ఐ పునఃపరిశీలన చేసి, తహసీల్దార్‌కు నివేదికలు పంపుతారన్నారు. ఆ తర్వాత తహసీల్దార్, వీఆర్వో, ఆర్‌ఐ నివేదికల్లో వివరాలను పరిశీలించి, తుది ఆమోదం తెలిపి వివరాలు భద్రపరుస్తారన్నారు. ఈ వివరాల్లో కచ్చితత్వాన్ని పెంపొందించేందుకు సాంఘిక సంక్షేమ శాఖ ఏఎస్‌డబ్ల్యూఓలతో సరాసరి 50 వివరాలు ర్యాండమ్‌గా తనిఖీ చేయిస్తామన్నారు. సోషల్ ఆడిట్‌ను తనతో పాటు, ఆర్డీఓలు పర్యవేక్షిస్తారని వెల్లడించారు.

30 నుంచి దేహదారుఢ్య పరీక్షలు



ఎస్పీ మణికంఠ చందోలు

చిత్తూరు అర్బన్: పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి నిర్వహించిన ప్రాథమిక రాత పరీక్షల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ఈనెల 30 నుంచి జనవరి 10వ తేదీ వరకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. చిత్తూరులోని పోలీసుల అతిథి గృహంలో శుక్రవారం పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి నిర్వహించిన ప్రాథమిక రాత పరీక్షల్లో 990 మంది మహిళలు, 4,248 మంది పురుషులు మొత్తం 5,238 మంది అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. వారికి ఈనెల 30 నుంచి జనవరి 10వ తేదీ వరకు దేహదారుఢ్య పరీక్షలు జరుగుతాయన్నారు. ఫిజికల్ మెజర్మెంట్, ఎఫిషియన్సీ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. పరీక్షల నిర్వహణ, సిబ్బంది బాధ్యతలపై అవగాహన కల్పించాలన్నారు. అభ్యర్థులు అన్ని విద్యార్హత, మెడికల్ పత్రాలు వెంట తెచ్చుకోవాలన్నారు.



పుంగనూరులో వైఎస్సార్ సీసీ నేతలు, కార్యకర్తలతో కలసి ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్ప (ఇన్‌సెట్) దివంగత సీఎం వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, రెడ్డెప్ప



సర్దుపోటుపై.. మండిపాటు



కూటమికి 'విద్యుత్' షాక్

- వర్షంలోనూ కదం తొక్కిన జనం
- విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ పోరుబాట
- జిల్లా వ్యాప్తంగా నియోజక వర్గ కేంద్రాల్లో ర్యాలీలు, ధర్నాలు
- వైఎస్సార్‌సీపీతో కలిసి కూటమి సర్కారుకు వ్యతిరేకంగా పాల్గొన్న జనం
- విద్యుత్‌శాఖ కార్యాలయాలను చుట్టుముట్టి నిరసన తెలిపిన నేతలు, కార్యకర్తలు

సర్దుపోటుపై జనం మండిపడ్డారు. జోరువానలోనూ నిరసన జ్వాలలు ఎగిసిపడ్డాయి. జనం ఆగ్రహం కట్ట తెంచుకుంది. కర్షక, కార్మిక, సామాన్య, మధ్య తరగతి జనం వైఎస్సార్ సీపీ అండతో పోరుబాట పట్టారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా ప్రజలు ప్లకార్డులు చేతపట్టి ర్యాలీ చేశారు. బాబు బాదుడుపై కదం తొక్కారు. విద్యుత్ కార్యాలయాలను ముట్టడించి.. ఆందోళన చేశారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే బాబు జనం నడ్డి విరుస్తున్నారని అన్నారు. చిత్తూరు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోని ట్రాన్స్‌కో కార్యాలయాల్లో అధికారులకు చార్జీలు తగ్గించాలని వినతి పత్రాలు అందజేశారు.

సాక్షి ప్రతినిధి, తిరుపతి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరునెలల కాలంలో రెండు సార్లు విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా వైఎస్సార్ సీపీ చేపట్టిన పోరుబాటకు అనూహ్య స్పందన లభించింది. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజక వర్గ కేంద్రాల్లో చేపట్టిన నిరసన కార్యక్రమాలకు ఆ పార్టీ శ్రేణులు, స్థానికులు భారీగా తరలివచ్చారు. ఓ వైపు వర్షం కురుస్తున్నా.. తడుస్తూ ర్యాలీలో పాల్గొని, కూటమి ప్రభుత్వ తీరుని ఎండగట్టారు. పుంగనూరులో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ కూడలి నుంచి ర్యాలీగా పీఎల్‌ఆర్ రోడ్డులోని ఏపీఎస్పీడీసీఎల్ కార్యాలయానికి చేరుకున్నారు. ప్లకార్డులు చేత పట్టి విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలంటూ నినదించారు. ఈ కార్యక్రమానికి చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, స్థానికులు పాల్గొన్నారు. నగరి నియోజక వర్గం పుత్తూరులో మాజీ మంత్రి ఆర్కే రోజా ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. పట్టణంలోని భవానీనగర్ విద్యుత్ కార్యాలయానికి చేరుకుని, నిరసన తెలియజేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రం సమర్పించారు. జిల్లా కేంద్రమైన చిత్తూరు నియోజక వర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, ఏడీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. పూతలపట్టులో మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో ట్రాన్స్‌కో కార్యాలయానికి చేరుకుని అధికారులకు వినతిపత్రం అందజేశారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గం కార్వేటినగరంలో నియోజక వర్గ సమన్వయకర్త కృపాలక్ష్మి ఆధ్వర్యంలో ర్యాలీగా ఏడీ కార్యాలయానికి చేరుకుని అధికారులకు వినతిపత్రం సమర్పించారు. పలమనేరులో మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ్ ఆధ్వర్యంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు, స్థానికులు అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అనంతరం విద్యుత్‌శాఖ కార్యాలయానికి చేరుకుని వినతిపత్రం సమర్పించారు. కుప్పంలో ఎమ్మెల్సీ భరత్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నేతలు ర్యాలీగా విద్యుత్ కార్యాలయానికి చేరుకుని అధికారులకు వినతి పత్రం సమర్పించారు.

జనంపై రూ.15 వేల కోట్లు భారం



ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలు తగ్గిస్తానని పల్లెపల్లెకు తిరిగి చంద్రబాబు ప్రజలకు మాయమాటలు చెప్పారు. అధికార పీఠంపై కూర్చున్న ఆరునెలల్లోనే రెండుసార్లు జనంపై సర్దుబాటు పేరుతో సుమారు రూ.15 వేల కోట్ల భారం మోపారు. అమరావతి పరిసర ప్రాంతాలకు మాత్రమే అభివృద్ధిని పరిమితం చేసి, రాష్ట్రాన్ని గాలికి వదిలేశారు. అమరావతికి మాత్రమే రూ.లక్ష కోట్లకు పైగా ఖర్చు పెడుతున్నారు. రాష్ట్రం అంటే అమరావతిలోని ఐదు గ్రామాలే కాదు..రాష్ట్రమంతా అనే విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తించాలి. చంద్రబాబు ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా నేరవేర్చలేదు. ప్రజలు గళం విప్పకపోతే తెలుగుదేశం ప్రభుత్వం అనేక రకాల పన్నులు వేసి, పీల్చిపిప్పి చేస్తుంది. ప్రజా సమస్యల పరిష్కారం కోసం వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుంది.

- ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి

ఉచిత 500 యూనిట్ల హామీని నెరవేర్చాలి



ఎన్నికల సమయంలో పవర్ ల్యూమ్స్ కార్మికులకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చిన కూటమి నాయకులు నెరవేర్చాలి. నగరి నియోజకవర్గంలో అత్యధికంగా పవర్‌ల్యూమ్స్ కార్మికులు ఉన్నారని, వారి కోసం 500 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తామని సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా పుత్తూరుకు వచ్చిన చంద్రబాబు, లోకేష్ నమ్మ బలికి, నేడు మోసం చేయడం ఎంత వరకు సబబు కాదు. అదే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నగరికి వచ్చినప్పుడు పవర్ ల్యూమ్స్ కార్మికుల కోసం 94 పైసల ట్రూఆప్ చార్జీలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించి అమలు చేశారు. తప్పుడు హామీలిచ్చి దొడ్డిదారిన అధికారంలోకి వచ్చిన కూటమి నాయకులు పవర్‌ల్యూమ్స్ కార్మికులను నిలువునా మోసం చేశారు. ఆరు నెలల్లోనే రూ.15,485 కోట్ల భారాన్ని ప్రజలపై మోపారు. ప్రజలపై ఇంతటి భారం మోపడం సరికాదని పవన్‌కళ్యాణ్ ఎందుకు ప్రశ్నించడం లేదు. ఆయనకు డిప్యూటీ సీఎంగా పదవి ఇచ్చినందుకు మాట్లాడడం లేదా? ప్రజలకు సమాధానం చెప్పాలి.

- మాజీ మంత్రి ఆర్కే రోజా



పుత్తూరులో పార్టీ శ్రేణులతో కలిసి బైక్ ర్యాలీ చేస్తున్న మాజీ మంత్రి రోజా



చిత్తూరులో ప్లకార్డులు చేపట్టి ర్యాలీగా వస్తున్న విజయానందరెడ్డి, చంద్రశేఖర్ నాయకులు



పూతలపట్టులో నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్, నాయకులు



కార్వేటినగరంలో విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ ర్యాలీ చేస్తున్న కృపాలక్ష్మి, నేతలు



పలమనేరులో ర్యాలీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు



కుప్పంలో ర్యాలీ చేస్తున్న ఎమ్మెల్సీ భరత్, వైఎస్సార్‌సీపీ నాయకులు

ప్రత్యేక అవసరాల గల పిల్లలపై దృష్టి



మాట్లాడుతున్న ఏపీసీ వెంకటరమణారెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని భవిత కేంద్రాలు, పాఠశాలల్లో చదువుతున్న ప్రత్యేక అవసరాల గల పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న ఓ ప్రైవేట్ పాఠశాలలో ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అతిథిగా విచ్చేసిన ఏపీసీ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల గల పిల్లలకు ప్రభుత్వం తరపున అలెవెన్సులు అందిస్తున్నట్లు తెలిపారు. ఒక్కొక్క విద్యార్థికి రవాణా భత్యం రూ.3 వేలు, ఎస్కార్ట్ అలవెన్స్ రూ.3 వేలు, హోం బేస్డ్ ఎడ్యుకేషన్ రూ. 2 వేలు, బాలికలకు స్టైఫండ్ రూ.2 వేలు ఇస్తున్నట్లు చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో అలింకో సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ క్యాంపుల్లో అర్హత పొందే ప్రత్యేక అవసరాల పిల్లలకు కృత్రిమ అవయవాలు ఉచితంగా ఇస్తున్నట్లు తెలిపారు. ఐఈ కోఆర్డినేటర్ జయప్రకాష్‌నాయుడు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల పిల్లలు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రతి విద్యార్థికి సీడబ్ల్యూఎస్‌ఎన్, సదరం, యూడీఐడీ కార్డు తప్పనిసరిగా ఉండేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. గ్రహణమొర్రి ఆపరేషన్లకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. రాష్ట్ర ఐఈ నరసింహ, ఐఈ అసిస్టెంట్ మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు సౌకర్యాలు కల్పించండి



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

కాణిపాకం: ఆంగ్ల నూతన సంవత్సరాది రోజు వరసిద్ధి వినాయస్వామి దర్శనార్థం వచ్చే భక్తులకు ఇబ్బంది కలగకుండా సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ చందోలు, ఎమ్మెల్యే మురళీమోహన్ ఆలయాధికారులను ఆదేశించారు. వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలోని సమావేశ మందిరంలో శుక్రవారం అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ జనవరి ఒకటో తేదీన స్వామి దర్శనార్థం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది ఉండకూడదన్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా ముందస్తు ఏర్పాట్లల్లో లోపాలు లేకుండా చూసుకోవాలన్నారు. ట్రాఫిక్ సమస్యలను అధిగమించాలన్నారు. పార్కింగ్ ప్రదేశాల్లోనే వాహనాలు పార్కింగ్ చేసేలా చూడాలన్నారు. తొలుత మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ మృతికి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు, ఏఈఓలు రవీంద్రబాబు, కృష్ణారెడ్డి, ధనంజయ, సీఐ శ్రీధర్‌నాయుడు అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

31న పింఛన్ల పంపిణీకి చర్యలు



డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఈ నెల 31వ తేదీన పింఛన్లు పంపిణీ చేసేలా చర్యలు చేపడుతున్నట్లు డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి అన్నారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒక రోజు ముందుగా పింఛన్ల పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. జనవరి 1వ తేదీన ఇవ్వాల్సిన పింఛన్ నగదును ఈ నెల 31 వ తేదీన ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు అందించేలా పకడ్బందీ చర్యలు చేపడుతున్నామన్నారు. జనవరి ఒకటో తేదీ ఆంగ్ల నూతన సంవత్సరాది కావడంతోపాటు క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బంది పని ఒత్తిడికి గురికాకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) నుంచి తమకు ముందస్తు ఆదేశాలు అందినట్లు చెప్పారు. పింఛన్ల పంపిణీకి సంబంధించిన జాబితాలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో డిసెంబర్ నెలకుగాను 2,67,140 మందికి దాదాపు రూ.112.99 కోట్లు పంపిణీ చేయాల్సి ఉంటుందన్నారు. ఈనెల 30న జిల్లావ్యాప్తంగా ఆయా ప్రాంతాల్లోని కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు బ్యాంకులకు వెళ్లి పింఛను నగదు డ్రా చేసి గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆయా మండలాల వారీగా ఉద్యోగులు ఈనెల 31న ఉదయం ఆరు గంటల నుంచే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి నగదు పంపిణీ చేస్తారన్నారు. జిల్లాలో ఆయా గ్రామ పంచాయతీల పరిధిలో ముందస్తుగా లబ్ధిదారులకు సమాచారం అందించాలని పంచాయతీ కార్యదర్శులకు ఇప్పటికే ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. గత రెండు నెలల్లో పింఛను తీసుకోనివారికి ఈనెలలో మూడు నెలల మొత్తం కలిపి పంపిణీ చేయనున్నట్లు పీడీ వెల్లడించారు.

క్లుప్తంగా

మదర్ థెరిసా పాఠశాలకు జాతీయస్థాయి అవార్డు



అవార్డు అందుకుంటున్న కరస్పాండెంట్

పెద్దపంజాణి: మదర్ థెరిసా పాఠశాల జాతీయస్థాయి ప్రతిష్టాత్మక ఈటీ టెక్ ఎక్స్ స్కూల్ ఎక్సలెన్స్ అవార్డు 2024 సాధించిందని ఆ స్కూలు కరస్పాండెంట్ రవీంద్రబాబు తెలిపారు. ఇటీవల తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ హైటెక్ సిటీలో జాతీయస్థాయి పాఠశాలలు పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఉత్తమ అకడమిక్ ఎక్సలెన్స్ స్కూల్, బెస్ట్ ఎమర్జెంట్ స్కూల్, బెస్ట్ హ్యాపీనెస్ కోషియంట్ స్కూల్ కేటగిరీలో ఎంపికై నందున పాఠశాల యాజమాన్యం శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా కరస్పాండెంట్ రవీంద్రబాబు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలు, నాణ్యమైన విలువలతో కూడిన విద్యా సదుపాయాలను అందించడమే తమ విద్యాసంస్థల ధ్యేయమన్నారు. దాని కోసం నిరంతరం శ్రమిస్తామని పేర్కొన్నారు. అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

సూర్యఘర్ పథకం పకడ్బందీగా అమలు

చిత్తూరు కలెక్టరేట్: సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ అన్నారు. ఆర్డీఓలు, తహసీల్దార్లు, పురపాలక కమిషనర్లతో శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. సూర్యఘర్ పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీలకు రూ.2 లక్షలు విలువైన 3 కిలోవాట్ల సోలార్ ప్యానల్స్ రాయితీపై రూ.78 వేలకే ఇంటి పైకప్పుపై ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. గృహ అవసరాలకు సరిపోగా.. మిగిలిన విద్యుత్‌ను గ్రిడు విక్రయించడం ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించవచ్చని చెప్పారు. ఫీడర్ లెవల్ సోలరైజెషన్‌కు అవసరమైన ప్రభుత్వ భూమిని గుర్తించాలని ఆదేశించారు. ఈ కాన్ఫరెన్స్‌లో జేసీ విద్యాధరి, డీఆర్వో మోహన్ కుమార్, విద్యుత్ శాఖ ఎస్‌ఈ ఇస్మాయిల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న నగదు అప్పగింత

శ్రీకాళహస్తి: హైదరబాద్‌కు చెందిన సూర్యప్రకాష్ కుటుంబం శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేసింది. ఆలయ ఆవరణలోని ఊంజల్ సేవ మండపం వద్ద తమ హ్యాండ్‌బ్యాగ్‌ను జారవిడుచుకున్నారు. గుర్తించిన ఆలయ సిబ్బంది దానిని అధికారులకు అందజేశారు. అందులో రూ.99,260 నగదు, రెండు సెల్ ఫోన్లు ఉన్నాయి. అందులోని విజిటింగ్ కార్డు ఆధారంగా అనౌన్స్‌మెంట్ చేశారు. అక్కడికి చేరుకున్న భక్తుల వివరాలను అడిగి తెలుసుకుని అప్పగించారు. దీంతో వారు ఆలయ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

బోయకొండ భద్రతకు ప్రత్యేక చర్యలు

- సిబ్బంది విధుల్లో మార్పు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు
- కంటి తుడుపు చర్యలపై భక్తులు ఆగ్రహం

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయ భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు ఆలయ ఈఓ ఏకాంబరం తెలిపారు. శుక్రవారం సాక్షి దినపత్రికలో «నిఘా నిద్దరోతోంది» శీర్షికన ఆలయంలో ఓ మహిళ మంగళవారం రాత్రి నిద్ర చేసిన ఘటనపై ప్రత్యేక కథనం ప్రచురితమైంది. ఈ ఘటనపై స్పందించిన ఈఓ ఆలయంలో విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ సిబ్బంది 12 మందితో సమావేశం నిర్వహించారు. ఈఓ మాట్లాడుతూ సంఘటన జరిగిన రోజు విధుల్లో ఉన్న ఆరుగురు సిబ్బందిని రాత్రివేళ నుంచి పగటిపూట డ్యూటీకి హాజరు కావాలని ఆదేశించి, మార్పులు చేశామన్నారు. ఆలయం తాళాలు వేసే సమయంలో ఆలయమంతా పరిశీలించిన తరువాతే తాళాలు వేయాలని ఆదేశించామని చెప్పారు. ఆలయ భద్రతకు భంగం కలిగేలా భక్తులు ప్రవర్తించకూదన్నారు. విధి నిర్వహణలో బాధ్యతగా పనిచేయాలన్నారు. డ్యూటీకి ఆలస్యంగా హాజరు కావడంతోపాటు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. ఇలాంటి ఘటన మరోసారి పునరావృతమైతే వారిని విధుల్లో నుంచి తొలగిస్తామన్నారు.

నిఘా ఇలా అయితే ఎలా?

ప్రముఖ ఆలయాల్లో గుడి తలుపులు తెరిచే సమయం, మూసి వేసే సమయాన్ని ఆగమ శాస్త్రం ప్రకారం నిర్వహిస్తారు. గుడి మూసే సమయంలో గర్భాలయంలో ఎవరూ ఉండకుండా చూసి, మూత వేయాలన్న నిబంధన ఉంది. ఆలయంలో అఖండ జ్యోతులు మినహా దీపాలు సైతం వెలిగించకూడదని ఆగమశాస్త్రం స్పష్టం చేస్తోంది. రాత్రి సమయాల్లో దేవతలు సంచరిస్తారన్నది ప్రతీతి. ఇందుకోసమే విద్యుత్ దీపాలను సైతం ఆర్పివేస్తారు. అయితే ఓ మహిళ రాత్రంతా ఆలయంలో నిద్రపోయిందంటే ఎంతటి నిర్లక్ష్యం ఉందో అర్థం అవుతోందని భక్తులు ఆరోపిస్తున్నారు.

సీసీ కెమెరాల పర్యవేక్షకులపై చర్యలేవీ?

ఆలయంలో సీసీ కెమెరాల పర్యవేక్షులపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఈఓ కంటి తుడుపుగా సెక్యూరిటీ సిబ్బందికి రూ.500 చొప్పున ఒకొక్కరికి జరిమానా విధించడం హాస్యాస్పదమని భక్తులు ఆరోపిస్తున్నారు. నిబంధల మేరకు చర్యలు తీసుకోలేని భక్తులు మండిపడుతున్నారు. సిబ్బందికి అంత తక్కువ మొత్తంలో జరిమానా ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

క్యూల వద్ద గ్రిల్స్ ఏర్పాటు

ప్రధాన ఆలయంలో క్యూలైన్ల లో చెక్క బెంచ్‌లను ఏర్పాటుచేశామని వాటికి చుట్టూ గ్రిల్స్ ఏర్పాటుచేస్తామని ఈఓ ఏకాంబరం తెలిపారు. భక్తులెవరూ చెక్క కిందకు లోపలికి వెళ్ళేందుకు వీలు లేకుండా రోజూ వారీ శుభ్రతా కార్యక్రమాలకు వీలుగా ఉండేలా పోతురాజు విగ్రహం ఎదుట చర్యలు తీసుకొంటామన్నారు. ఆలయ భద్రతకు అవసరమైన కెమెరాల నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతల కోసం ప్రత్యేక సిబ్బందిని కేటాయిస్తామని చెప్పారు. సెక్యూరిటీ సిబ్బంది రాత్రి సమయాల్లో నిద్రపోకుండా ఆలయం , పరిసర ప్రాంతాల్లో సంచరిస్తూ ప్రతి గంటకొకసారి గ్రూపులో జీపీఎస్ ఆధారిత ఫొటోలు అప్‌లోడ్‌చేసేలా ఆదేశించినట్లు ఈఓ పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

పర్యవేక్షకుల నిర్లక్ష్యానికి నిదర్శనం

సాధారణంగా గర్భాలయంలో భక్తులకు ప్రవేశం నుంచి రాత్రి వరకు సీసీ కెమెరాల పర్యవేక్షణ కొనసాగుతుంది. కానీ బోయకొండ ఆలయంలో ఇందుకు విరుద్ధంగా జరిగింది. కెమెరాల పర్యవేక్షణకు రోజూ ఇద్దరు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నా ఆ మహిళ గుడిలో ఉండి పోవడాన్ని గమనించకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శంగా నిలుస్తోంది. అలాగే కెమెరాల పర్యవేక్షణ లోపంతో పాటు గర్భాలయంలో పగలు దర్శనం తరువాత బయటకు వెళ్లే వరకు సీసీ కెమెరాల్లో పరిశీలిస్తుండాలి. పగలు ఓ మహిళ అమ్మవారి దర్శనం తరువాత క్యూలో చెక్క కింద రాత్రంతా నిద్రపోయిందంటే నిఘా కెమెరా పర్యవేక్షణ లేదని చెప్పకనే తెలుస్తోంది.



ఆలయంలో పోతురాజు విగ్రహం వద్ద క్యూలో చెక్కల కిందకు దూరివెళ్తున్న మహిళ

సాక్షి ఎఫెక్ట్..



మహిళ రాత్రంతా నిద్ర చేసిన ప్రాంతం ఇదే

నో డ్రగ్స్ అని చెప్పండి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : యువతకు నో డ్రగ్స్ అని చెప్పాలని, వారు తాత్కాలిక ఆనందం, సరదాల కోసం మత్తుపదార్థాల బారిన పడకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పలు శాఖలతో వరుస సమీక్ష సమావేశాలు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి విద్యాసంస్థలో డ్రగ్స్ నివారణపై అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలన్నారు. డ్రగ్స్ వినియోగంతో కలిగే ఆరోగ్య సమస్యలు, చట్టపరమైన ఇబ్బందులపై అవగాహన కల్పించాలన్నారు. మత్తుపదార్థాల బారిన పడకుండా యువతను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. విద్యార్థులు ఇళ్లల్లో కంటే విద్యాసంస్థల్లోనే ఎక్కువ సమయం ఉంటారని, వారి ప్రవర్తనపై అధ్యాపకులు, ప్రిన్సిపాళ్లు ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. మత్తుపదార్థాలకు బానిస కావడం, సరఫరా చేస్తున్నట్లు ఎటువంటి సమాచారం ఉన్నా వెంటనే పోలీసులకు తెలపాలన్నారు. ఆ వివరాలను రహస్యంగా పెడుతారన్నారు. ఎస్పీ మణికంఠ చందోలు మాట్లాడుతూ విద్యాసంస్థల్లో మత్తుపదార్థాల అవగాహనకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. విద్యార్థులతో చనువుగా ఉంటూ వారి నడివడికను పరిశీలించాలని తెలిపారు. డ్రగ్స్ సమాచారాన్ని టోల్ ఫ్రీ నంబర్ 1972, పోలీసులకు తెలపాలన్నారు. మత్తుపదార్థాలకు బానిసైన విద్యార్థులను జైలుకు పంపకుండా ప్రత్యేక కౌన్సెలింగ్ ఇచ్చి వారు మంచి మార్గంలో నడిచేలా కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో డీవీఈఓ సయ్యద్‌మౌలా పాల్గొన్నారు.

బ్లాక్ స్పాట్ ప్రదేశాల్లో ప్రత్యేక చర్యలు

జిల్లాలో గుర్తించిన బ్లాక్‌స్పాట్ ప్రదేశాల్లో ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ తెలిపారు. జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్లాక్ స్పాట్స్ ఉన్న ప్రదేశాల్లో సత్వరమే ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకునేలా జాతీయ రహదారుల అధికారులు చొరవ చూపాలన్నారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో సమస్యాత్మక జంక్షన్లు, స్కూల్ జోన్లు, కాలేజీలు, హాస్పిటళ్ల వద్ద స్పీడ్ బ్రేకర్లు లైటింగ్, రంబుల్ స్టిక్స్ ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. ఎస్పీ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపితే ఎటువంటి వారైనా కేసులు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో డీటీసీ నిరంజన్ రెడ్డి, డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధారాణి, డీసీహెచ్‌ఎస్ ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అండర్ -17 క్రీడా పోటీలు



రాష్ట్రస్థాయి పోటీకి ఎంపికైన క్రీడాకారులు

నగరి : మండలంలోని ఏకాంబరకుప్పం జిల్లా ఉన్నత పాఠశాలలో నాలుగు రోజులుగా జరిగిన అండర్ 17 బాల బాలికల త్రోబాల్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 28 నుంచి గుంటూరు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చిత్తూరు జిల్లా కోచ్‌లు చిన్నప్ప, ప్రకాష్ తెలిపారు. చదువుతో పాటు, క్రీడల్లో రాణించడం చాలా ఆనందంగా ఉందని, రాష్ట్రస్థాయిలో జరిగే క్రీడల్లో కూడా ప్రతిభను కనబరచి మంచి గుర్తింపు తీసుకురావాలని పాఠశాల హెచ్‌ఎం నమశివాయం కోరారు. అనంతరం విజేతలను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో పీఈటీ మణి, కార్తికేయన్, తదితరులు పాల్గొన్నారు.

ఆదాయపన్ను చెల్లింపులపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఇన్‌కమ్ ట్యాక్స్ జేసీ వంశీధర్

పుత్తూరు: ఆదాయపన్ను చెల్లింపులపై అవగాహన అవసరమని తిరుపతి ఇన్‌కమ్ ట్యాక్స్ జాయింట్ కమిషనర్ వంశీధర్ తెలిపారు. శుక్రవారం పుత్తూరులో ఇన్‌కమ్ ట్యాక్స్ పేయర్లు, కన్సల్‌టెంట్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పన్ను చెల్లింపునకు సంబంధించిన అన్ని అంశాలను తెలుసుకోవాలన్నారు. రీసోర్స్ పర్సన్ శివరామకృష్ణ మాట్లాడుతూ అడ్వాన్స్ టాక్స్ పేమెంట్, కాన్‌సీక్వెన్స్ ఆఫ్ ట్యాక్స్ రీఫండ్, క్యాష్ విత్‌డ్రాల్, డిపాజిట్, డైరెక్ట్ టాక్స్ వివాద్ సేవిశ్వాస్ స్కీమ్–2024 అంశాలను వివరించారు. అనంతరం కన్సల్‌టెంట్లు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో అడ్వకేట్, టాక్స్ కన్సల్‌టెంట్ రామకృష్ణ, యశ్వంత్, సాయికుమార్, గజేంద్ర, కేకేసీ లా కళాశాల విద్యార్థులు , ట్రేడ్ యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రివిజన్‌పై దృష్టి పెట్టండి

హెచ్‌ఎంల సమావేశంలో డీఈఓ వరలక్ష్మి

పలమనేరు: పదో తరగతి సిలబస్ త్వరగా పూర్తి చేసి, రివిజన్‌పై దృష్టి సారించాలని డీఈఓ వరలక్ష్మి ఆదేశించారు. పట్టణంలోని మధు కళాశాలలో పలమనేరు డివిజన్‌కు సంబంధించిన పది మండలాల హెచ్‌ఎంలతో గురువారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్నందున చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆయా మండలాల్లోని టీచర్ల ఖాళీల వివరాలను ఇవ్వడంలో ఎందుకు ఆలస్యం చేస్తున్నారని ప్రశ్నించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరులో ఎలాంటి నిర్లక్ష్యం చేయకూడదని హెచ్చరించారు. వర్షాకాలం అయినందుదన పాతభవనాల్లోని గదుల్లో పిల్లలను కూర్చోబెట్టకూడదన్నారు. వ్యాధులు సోకే అవకాశం ఉన్నందున ఆరోగ్యంపై పిల్లలకు సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. విద్యార్థుల సామర్థ్యాలపై వారి తల్లిదండ్రులకు సైతం తెలపాలని సూచించారు. ఈ సమావేశంలో పలువురు ఎంఈఓలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ వరలక్ష్మి

వంద రోజుల యాక్షన్ ప్లాన్‌పై సమీక్ష

నగరి : పదో తరగతి విద్యార్థులకు వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా శుక్రవారం డీఈఓ వరలక్ష్మి నగరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నగరి డివిజన్ పరిధిలోని అన్ని మండలాల ఎంఈఓలు, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రోజూ ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహణపై యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సూచించారు. దాని ఆధారంగా చదువులో వెనుకబడిన వారిని గుర్తించి, ప్రత్యేక తరగతులు నిర్వహించి, మెరుగు పరచాలని కోరారు.

భక్తి శ్రద్ధలతో రాహుకాల అభిషేక పూజలు



విశేషాలంకరణలో బోయకొండ గంగమ్మ



అన్నప్రసాదాలు పంపిణీ చేస్తున్న ఈఓ ఏకాంబరం

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయంలో అమ్మవారికి శుక్రవారం రాహుకాల అభిషేక పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వేకువ జామున ఆలయ అర్చకులు అమ్మవారి గర్భాలయాన్ని శుద్ధి చేసి, కైంకర్యాలు పూర్తి చేశారు. రాహుకాల సమయం 10.30 నుంచి 12 గంటల వరకు అర్చనలు, అభిషేక పూజలు జరిపారు. అనంతరం స్వర్ణాభరణాలు, సుగంధభరిత పుష్పాలతో ముస్తాబు చేసి, భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో పవిత్ర తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ఉచిత అన్నప్రసాదం సౌకర్యం కల్పించారు. ఈఓ స్వయంగా ప్రసాదాలను పంపిణీ చేశారు.

వాచ్‌మన్ ఉద్యోగానికి టీడీపీ నేతలకు రూ.30 వేల లంచం



పాలసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల



సేటు, మాజీ వాచ్‌మన్

పాలసముద్రం : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వాచ్‌మన్ ఉద్యోగానికి టీడీపీ నేతలు రూ.30 వేలు లంచం తీసుకుని ఉద్యోగం ఇచ్చిన విషయం శుక్రవారం వెలుగులోకొచ్చింది. కళాశాలలో ఇప్పటివరకు వెంగళరాజుకుప్పం దళితవాడకు చెందిన సేటు వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. టీడీపీ నేతలు అధికారులను బెదిరించి సేటును ఉద్యోగం నుంచి తొలగింపజేశారు. అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తి వద్ద రూ.30 వేలు లంచం తీసుకుని ఆ ఉద్యోగం ఇచ్చినట్లు టీడీపీ నాయకులే చెప్పుకొంటున్నారు. ఉన్న ఫళంగా తనను ఉద్యోగం నుంచి తొలగించి.. డబ్బులు తీసుకుని వేరే వ్యక్తి ఆ ఉద్యోగం ఇచ్చారని సేటు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సారా, మద్యం కేసులో ముగ్గురి అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ సురేష్‌రెడ్డి

పుంగనూరు: మండలంలో సారా విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులు, కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఒకరిని శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ సురేష్‌రెడ్డి తెలిపారు. పుంగనూరు మండలంలోని నల్లగుట్లపల్లెతాండలో 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని బాబునాయక్, మునెమ్మను అరెస్టు చేశామన్నారు. అలాగే పెద్దపంజాణి మండలం చీకలదిన్నిలో కర్ణాటక టెట్రా ప్యాకెట్లు విక్రయిస్తున్న శివశంకర్‌ను అరెస్టు చేసి, 40 ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిని కోర్టులో హాజరుపరిచి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు జవహర్‌బాబు, మోహన్, ఎస్‌ఐ వేణుగోపాల్‌రెడ్డి , సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు.

మరుగుదొడ్ల కూల్చివేతపై విచారణ



స్థానికులతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ రవి కుమార్‌నాయుడు, డీపీఓ సుధాకర్‌రావు

ఐరాల: మండల కేంద్రంలో మరుగుదొడ్లు, ఇల్లు కొంత భాగం కూల్చివేతపై శుక్రవారం జెడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడు, డీపీఓ సుధాకర్‌రావు విచారణ చేపట్టారు. ఈ విషయమై మండల కేంద్రానికి చెందిన హేమలత ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. స్థానిక రెడ్డి ప్రతాప్‌కు చెందిన రెండతస్తుల భవనంలో కొంత భాగం శిథిలావస్థ స్థితిలో ఉన్నందున, ప్రస్తుతం తుపాను, వర్షాల కారణంగా కూలిపోయే ప్రమాదం ఉందని పంచాయతీ అధికారులు గుర్తించారు. చుట్టుపక్కల ఉన్న ప్రజలు, చిన్న పిల్లలకు ప్రమాదం సంభవించే అవకాశం ఉండడంతో భద్రత దృష్ట్యా మరుగుదొడ్లను తొలగించాలని భవన యజమానికి గ్రామ పంచాయతీ అధికారులు మూడు సార్లు నోటీసులు జారీ చేశారు. కానీ వారు స్పందించక పోవడంతో ప్రజల భద్రత దృష్ట్యా ఈ నెల 16వ తేదీ రెవెన్యూ, పోలీసుల సహకారంతో గ్రామ పంచాయతీ అధికారులు భవనంలోని శిథిలావస్థ స్థితిలో ఉన్న మరుగుదొడ్ల భాగాన్ని కూల్చివేశారు. దీంతో జెడ్పీ సీఈఓ, డీపీఓ భవనం పరిశీలించి నివేదికలను జాయింట్ కలెక్టర్‌కు సమర్పించనున్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

కాణిపాకం: వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం నిత్యాన్నదాన ట్రస్టుకు ఓ దాత శుక్రవారం రూ.లక్ష నగదు విరాళం చేశారు. విశాఖపట్నం నగరానికి చెందిన దాత హర్షవర్ధన్ ఈ మొత్తాన్ని ఆలయాధికారులకు అందజేశారు. అనంతరం అధికారులు దాతలకు దర్శన ఏర్పాట్లు చేశారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న లారీ

ముగ్గురికి గాయాలు, ఒకరి పరిస్థితి విషమం

గంగవరం: ద్విచక్ర వాహనంలో ముగ్గురు యువకులు ప్రయాణిస్తూ అజాగ్రత్తగా రోడ్డు దాటుతుండగా ప్రమాదవశాత్తు లారీ ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన గంగవరం మండలంలో శుక్రవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. పలమనేరు పట్టణానికి చెందిన రాహుల్(19), అయ్యప్ప(20), రంజిత్(18) ముగ్గురూ కలిసి గంగవరం సమీపంలోని ఆర్‌ఆర్ డాబా వద్దకు వచ్చారు. అక్కడి నుంచి ద్విచక్ర వాహనంలో పలమనేరుకు బయలుదేరారు. అయితే గంగవరం ఫ్లెవైర్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేస్తున్నారని పసిగట్టిన యువకులు డాబా నుంచి హైవేపై అజాగ్రత్తగా రోడ్డు దాటుతుండగా తిరుపతి వైపు వెళుతున్న లారీ ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. వారిలో ఒకరి పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం తిరుపతికి రెఫర్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





ప్రమాదంలో లారీ కింద పడిన యువకుడు, తీవ్రంగా గాయపడిన యువకుడు

ఆగి ఉన్న లారీని ఢీకొన్న బస్సు

పెళ్లకూరు: నాయుడుపేట–పూతలపట్టు జాతీయ రహదారి మార్గంలో గుర్రప్పతోట గ్రామం వద్ద శుక్రవారం ఆగి ఉన్న లారీని బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న 20 మందికి పైగా అయ్యప్ప భక్తులకు గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు.. విజయనగరం ప్రాంతానికి చెందిన 25 మంది అయ్యప్ప భక్తులు శబరిమలై యాత్ర ముగించుకొని తిరుగు ప్రయాణంలో విజయనగరానికి వెళ్తున్నారు. మార్గ మధ్యంలో గుర్రప్పతోట గ్రాం వద్ద మరమ్మతులకు గురై రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ప్రమాదవశాత్తు బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సులోని 20 మంది భక్తులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నాయుడుపేటకు తరలించారు.